

## నేటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి

మేడ్చల్ ప్రతినిధి, మే 4(ఆంధ్రజ్యోతి): వానకాలం సాగుకు అన్నదాతలను సమాయత్తం చేసేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ తెలిపారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇప్పటికే రైతులు వానకాలం సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. నకిలీ విత్తనాల బారిన పడటం, ప్రతిసారి వేసిన పంటలను మళ్లీమళ్లీ వేయడం, అధిక దిగుబడుల సాధనకు మోతాదుకు మించిన ఎరువులు వినియోగంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులను చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. సీజన్ సమయంలో రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వెళ్లడంతో చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రైతు వేదికల ద్వారా ప్రతివారం శాస్త్రవేత్తలతో ముచ్చటించే కార్యక్రమాలు కొనసాగుతున్నా దూరభారంతో చాలా వరకు రైతులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. జిల్లాలోని మేడ్చల్, ఘట్‌కేసర్‌లో నేటి నుంచి జూన్ 16వ తేదీ వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి గ్రామంలో, రైతు వేదిక, గ్రామపంచాయతీ భవనాల వద్ద నిర్వహిస్తామని పేర్కొన్నారు. రైతు నమోదు కార్యక్రమం కూడా నేటి నుంచి ప్రారంభమౌతుందని, ఈ కార్యక్రమంలో ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం పట్టా పాస్ పుస్తకము, ఆధార్ కారుతో మీ సేవ, లేదా వ్యవసాయ శాఖ అధికారి వద్ద గాని నమోదు చేసుకోవాలని కోరారు.



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

దుద్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. మండలంలోని రక్తమైసమ్మ తండాకు 1.2కిలో మీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.1.62కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, ముజీబ్, శ్రీశైలంగౌడ్, ఖాజా, ఖలీల్‌పాషా పాల్గొన్నారు.



ఈ ఏడాది యాసంగి సీజన్ ఆశాజనకంగా ఉంది. వివిధ పంటల సాగుతో కళకళలాడుతోంది. ప్రధానంగా వరి సాగు అధికంగా జరిగింది. ఆ తర్వాతి స్థానం మొక్కజొన్న పంటకు దక్కింది. గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఆరంభంలో పంటల సాగు నత్తనడకన సాగినా.. ఆ తర్వాత పుంజుకుంది. భూగర్భజలాలు అందుబాటులో ఉండడంతో పాటు మార్చి, ఏప్రిల్ నెలలో వర్షాలు కురవడం కూడా పంటలు సాగు పెరగడానికి దోహదపడింది. ప్రభుత్వం వరి సన్నాలకు ప్రోత్సాహకం ఇవ్వడంతో యాసంగిలో వీటి సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది.

6

- గణనీయంగా పెరిగిన విస్తీర్ణం
- ఆశాజనకంగా యాసంగి సీజన్
- ఆరంభంలో నత్తనడక
- చివరి దశలో ఊపు
- వరి వైపు రైతుల మొగ్గు
- మొక్కజొన్నపై మక్కువ
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 140శాతానికి పైగా సాగు
- 150 శాతానికిపైగా వరి సాగు



# యాసంగి జోరు!



## రికార్డుస్థాయిలో పంటల సాగు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగి(రబీ) సీజన్ ఆశాజనకంగా ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ఈ ఏడాది రబీలో రైతులు రికార్డుస్థాయిలో వివిధ పంటలు సాగు చేశారు. తాజాగా వ్యవసాయశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం చూస్తే యాసంగి సీజన్‌లో రంగారెడ్డి జిల్లా, వికారాబాద్ జిల్లాల్లోని రైతులు సాధారణానికి మించి అంటే 140 శాతానికిపైగా పంటలు సాగు చేశారు. యాసంగి ఆరంభంలో నత్తనడక సాగిన పంటల సాగు చివరి దశలో అనూహ్యంగా పుంజుకుంది. వరి, మొక్కజొన్న పంటల సాగు మునుపెన్నడూ లేని విధంగా పెరిగింది. దీనికి వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించాయి. భూగర్భజలాలు అందుబాటులో ఉండడంతో పాటు మార్చి, ఏప్రిల్ నెలలో వర్షాలు కురవడం కూడా పంటలు సాగు పెరగడానికి కొంత దోహదపడింది. ఇదిలా ఉంటే రంగారెడ్డి జిల్లాలో యాసంగిలో సాధారణంగా 1,02,063 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,44,207 ఎకరాల్లో రైతులు పంట వేశారు. గత ఏడాది కంటే ఇది అధికం. అలాగే వికారాబాద్ జిల్లాలో 1,11,331 ఎకరాలకు గానూ 1,12,083 ఎకరాల్లో, మేడ్చల్ జిల్లాలో 13,849 ఎకరాలకు 16,620 ఎకరాల్లో వరి వేశారు. ఇదిలా ఉంటే గత ఏడాది యాసంగిలో

మిగతా 7వ పేజీలో...

**ఈ ఏడాది వర్షపాతం (మి.మీ.లలో)**

| జిల్లా | సాధారణ వర్షపాతం | ఇప్పటి వరకు కురిసింది | పెరుగుదల/ తరుగుదల శాతంలో |
|---|---|---|---|
| రంగారెడ్డి | 696.2 | 832.4 | 20 |
| వికారాబాద్ | 767 | 1030.3 | 34 |
| మేడ్చల్ | 770.1 | 865.9 | 12 |

**ఉమ్మడి జిల్లాలో యాసంగి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)**

| జిల్లా | సాధారణ సాగు | ఇప్పటి వరకు సాగు | శాతం |
|---|---|---|---|
| రంగారెడ్డి | 1,02,063 | 1,44,207 | 141 |
| వికారాబాద్ | 1,11,331 | 1,12,083 | 140 |
| మేడ్చల్ | 13,849 | 16,620 | 120 |

**వరి సాగు**

| జిల్లా | సాధారణ సాగు | ఇప్పటి వరకు సాగు | శాతం |
|---|---|---|---|
| రంగారెడ్డి | 71,775 | 1,12,313 | 156 |
| వికారాబాద్ | 61,628 | 91,272 | 148 |
| మేడ్చల్ | 11,241 | 13,999 | 124 |

**మొక్కజొన్న సాగు**

| జిల్లా | సాధారణ సాగు | ఇప్పటి వరకుసాగు | శాతం |
|---|---|---|---|
| రంగారెడ్డి | 7,774 | 22,606 | 290 |
| వికారాబాద్ | 6,481 | 12,369 | 190 |
| మేడ్చల్ | 230 | 272 | 118 |



## వికసించిన మే పుష్పం

కేవలం మే నెలలోనే వికసించే మే పుష్పం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని చందుపట్లగూడలో చందుపట్ల కల్పన ఇంటి ఆవరణలో ఆదివారం వికసించింది. ఎర్రని బంతి ఆకారంలో ఉండే ఈపుష్పం దుంప (గడ్డ)జాతికి చెందినది. మే నెల వచ్చిందంటే చాలు భూమిలో నిద్రానంగా ఉండే దుంప నుంచి కాండం బయటకు వచ్చి నాలుగైదు రోజుల్లోనే పువ్వు వికసిస్తుంది. వారం రోజులపాటు కనువిందు చేసే ఈ పుష్పం ఎండిపోగానే దాని పక్క నుంచి ఆకులు వచ్చి పచ్చని మొక్కగా మారుతుంది. నాలుగైదు నెలలకు ఆకులన్నీ ఎండిపోయి భూమిలోనే ఉండి మే నెలలో బయటకు రావడం ఈమొక్క ప్రత్యేకత.

ఘట్‌కేసర్, మే 4(ఆంధ్రజ్యోతి)

## ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా

» కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. జిల్లాలో రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు ఉండడంతో ఈ నెల 5న జరగాల్సిన ప్రజావాణి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని, ఎవరూ కూడా ప్రజావాణికి రావొద్దని కోరారు.

## నీట్ ప్రశాంతం



మేడ్చల్‌లో పరీక్షా కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

వికారాబాద్/మేడ్చల్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ టెస్ట్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆదివారం నిర్వహించిన నీట్ - యూజీ - 2025 పరీక్ష వికారాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ బాలికల, బాలుర గురుకుల పాఠశాలలు, జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, సంగం లక్ష్మీబాయి బాలికల గురుకుల పాఠశాలలో నీట్ పరీక్ష నిర్వహించారు. ఐదు కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 1193 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1154 మంది హాజరయ్యారు. 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థుల హాజరు శాతం 96.73గా నమోదైంది. కొత్తగడిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 360 మంది విద్యార్థులకు 347 మంది హాజరు కాగా, 13 మంది గైర్హాజరయ్యారు. అనంతగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 232 మంది హాజరు కాగా, 8 మంది గైర్హాజరయ్యారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 232 మంది హాజరు కాగా, 8 మంది గైర్హాజరయ్యారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 233 మంది హాజరు కాగా, ఏడుగురు హాజరు కాలేదు. సంగం లక్ష్మీబాయి టీఎస్ బాలికల గురుకుల పాఠశాలలో 113 మంది విద్యార్థులకు 110 మంది హాజరు కాగా ముగ్గురు

మిగతా 8వ పేజీలో...



### వికారాబాద్ జిల్లాలో 96.73% హాజరు..



జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి



మాధారంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరిధాన్యం

## ధాన్యానికి తూకమెప్పుడు?

**వరి కోతలు ప్రారంభమై 20 రోజులు.. కొనుగోలు కేంద్రంలోనే మగ్గుతున్న ధాన్యం**

**అన్నదాతలను భయపెడుతున్న వరుణుడు.. మాధారం కొనుగోలు కేంద్రంలో రైతుల అగచాట్లు**

ఘట్‌కేసర్ రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించినా కాంటా పెట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మాధారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ అధికారులు కాంటా పెట్టలేదు. హమాలీలను ఏర్పాటు చేయలేదు. ధాన్యమంతా కేంద్రంలోనే మగ్గుతుంది. వరుణుడు భయపెడుతున్నాడు. మధ్యాహ్నం దాటితే చాలు ఉరుములు, మెరుపులతో దడపుట్టిస్తున్నాడు. రైతులు రోజూ ధాన్యాన్ని ఆరబోసి సాయంత్రం కుప్ప నేర్పి కవర్ కప్పుతూ ధాన్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

### హమాలీలు లేక ఇబ్బందులు

మండలంలోని ఎదులాబాద్, మాధారం, ప్రతాప్‌సింగారం గ్రామాల్లో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరుగుతున్నా మాధారం కేంద్రానికి తూకాలు, హమాలీలు రాలేదు. మాధారంతోపాటు అవుశాపూర్, అంకుశాపూర్ గ్రామాల రైతులు 1200 ఎకరాల్లో

మిగతా 8వ పేజీలో...



### హమాలీలను ఏర్పాటు చేయాలి

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 20 రోజులు గడుస్తుంది. అంతకంటే ముందే రైతులు వరి కోతలు చేపట్టి ధాన్యాన్ని కేంద్రానికి తరలించారు. ఇప్పటికీ సెంటర్‌లో తూకాలు వేయలేదు. హమాలీలను తీసుకురాలేదు. ఇప్పటికైనా అధికారులు ధాన్యాన్ని సేకరించాలి.

- నల్లోల యాదగిరి, రైతు, మాజీ సర్పంచ్ మాధారం

## నేడు ఆర్టీసీ ఉద్యోగుల కవాతు

పరిగి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీ నుంచి చేపట్టనున్న ఆర్టీసీ సమ్మెలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపం నుంచి బస్సు భవన్ వరకు నిర్వహించే ఆర్టీసీ ఉద్యోగుల కవాతును విజయవంతం చేయాలని ఆర్టీసీ జేఏసీ కో-కన్వీనర్ కె.హణ్మంత్‌ముదిరాజ్ ఆదివానం ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి ఉద్యోగులు తరలిరావాలని కోరారు. వీక్లీఆఫ్, స్పెషల్‌ఆఫ్, నైట్ షిఫ్ట్ దిగిన వారంతా భారీసంఖ్యలో తరలిరావాలని కోరారు.

## కంకర వేశారు.. బీటీ మరిచారు

- గుంతలమయమైన రుద్రారం-తాండూర్ రోడ్డు
- ఏడాది క్రితమే నిధులు మంజూరు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

8



విద్యార్థులతో మాట్లాడుతున్న అలుగు వర్షిణి

## చదువుతో అసమానతలు దూరం

**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి వర్షిణి**

ఘట్‌కేసర్ రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో అసమానతలు దూరమవుతాయని, క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆదివారం సందర్శించారు. విద్యార్థులు చేసిన చేరియాల్ పెయింటింగ్, పోయెట్రీ, కార్టూన్ జర్నలిజం అండ్ రైటింగ్ స్కిల్స్, నేచర్ లీడర్స్ ప్రోగ్రాం బై డబ్ల్యుడబ్ల్యుఎఫ్, ఫొటోగ్రఫీ, వేదిక్ మ్యాథ్స్, పెయింటింగ్ అండ్ డ్రాయింగ్, బంజారా ఎంబ్రాడరీ ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. చదువుతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు లలిత కళల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 238 గురుకుల పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లు, సదస్సుల్లో పాల్గొని మేదాశక్తిని పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఫొటో సెషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శులు శక్రునాయక్, శారద, అదనపు కార్యదర్శి సంతోషి, అధికారులు భీమయ్య, రజిని, నిర్మల, విద్యారాణి, ప్రిన్సిపాల్ రాము, వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొబ్బరి నీళ్లు.. పోషకాలు మెండు

చేవెళ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎండ కాలంలో శరీర ఉష్ణోగ్రత పెరిగి ఎన్ని నీళ్లు తాగినా దహం తీరదు. ఎండలో తిరిగితే వడ దెబ్బ తగలడం ఖాయం. ఎండ కాలంలో కొబ్బరిబోండా తాగితే శరీర సత్తువ పోకుండా, వేసవి తాపం నుంచి ఉపశమనం కలుగుతుంది. ఈ క్రమంలో చేవెళ్ల ప్రాంతంలో కొబ్బరి బోండాల వ్యాపారం జోరుగా సాగుతోంది. వేసవిలోలో నాలుగు నెలల పాటు ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది. స్థానికంగా 20దాకా తోపుడు బండ్లు ఉన్నాయి. ఒక్కో కొబ్బరిబోండం రూ.50 నుంచి 55 రూపాయలకు అమ్ముతున్నారు.


చేవెళ్లలో కొబ్బరిబోండాల అమ్మకాలు

**బోండాంతో ప్రయోజనాలు**

వేసవిలో వడదెబ్బ సోకినవారి శరీరం కోల్పోయిన లవణాలను కొబ్బరి నీరు భర్తీ చేస్తుంది. శరీరంలో వేడిని తగ్గిస్తుంది. అజీర్తి సమస్యలను నివారిస్తుంది. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు బోండాం శక్తి నిస్తుంది. వర్షాకాలంలో డయేరియా పీడితులకు కొబ్బరి నీరు సంజీవనిలా పనిచేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

**కొబ్బరి నీటిలో పుష్కలంగా పోషకాలు**

ఒక కొబ్బరిబోండాం నీటిలో పుష్కలంగా మినరల్స్ ఉంటాయి. అలాగే ఇనుము, ప్రొటీన్లు, చక్కర, కొవ్వులు, రాగి, పొటాషియం, సోడియం, కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం సూక్ష్మపోషకాలూ లభిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

● **ఆహారం కోసం ...**

కొత్తగూడలో ఓ రైతు దుక్కి దున్నుతుండగా పురుగుల కోసం వందలాది కొంగలు చేరాయి. దుక్కిలోంచి వచ్చే పురుగులను ఏరుకున్నాయి.

- కందుకూరు, మే 4





E-Mail: hsfcc41@gmail.com
Website: www.tsfcc1941.com
Phone : 040-23552830
Mobile: 96408 55520

**TELANGANA STATE FILM CHAMBER OF COMMERCE™**
(The Hyderabad State Film Chamber of Commerce)
(Nizam Circuit)
Plot No. 42-C, 3rd Floor, Road No.11, Beside Sai Baba Temple, Film Nagar, Jubilee Hills, Hyderabad-500 096, T.S.
(Recognised By Govt. of T.S.)

2025-27 సంవత్సరాలకు (2 సంవత్సరాలు) సాధారణ ఎన్నికలు మరియు 80వ వార్షిక సర్వసభ్య సమావేశం ఛాంబర్ ఆవరణ వద్ద 07 జూన్ 2025 (శనివారం) నిర్వహించబడుతుందని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ది హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) యొక్క సభ్యులకు తెలియచేయడమైనది.

ఆఫీస్ బేరర్ లేదా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా ఏదైనా పోస్టుకు అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఎవరైనా సభ్యుడు అతని/ఆమె నామినేషన్ దాఖలు చేయుటకు ముందే అన్ని బకాయిలను ఏవైనా ఉంటే చెల్లించాలి.

**ఎలక్షన్ క్యాలెండర్**

| | | |
|---|---|---|
| 1 | ఆఫీస్ బేరర్లు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల ఎన్నికల కొరకు నామినేషన్ల స్వీకరణ | 14.05.2025 ఉ.10.00 గం.నుండి |
| 2 | ఆఫీస్ బేరర్లు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల ఎన్నికల కొరకు నామినేషన్ల స్వీకరణకు ఆఖరి తేది | 24.05.2025 మ.3.00 గం.వరకు |
| 3 | చెల్లుబాటు గల నామినేషన్ల పరిశీలన మరియు ప్రకటన | 24.05.2025 సా.4.00 గం.కు |
| 4 | ఉప సంహరణలకు అనుమతి | 27.05.2025 మ.3.00 గం.లోగా |
| 5 | ఆథరైజేషన్ లెటర్ దాఖలు చేయుట | 05.06.2025 సా.5.00 గం.నుండి |
| 6 | 2025-2027 సంవత్సరాలకు ఎన్నికలు (ఓటింగ్) | 07.06.2025 ఉ.10.00 గం.నుండి మ.2.00 గం.మధ్య |
| 7 | 80వ వార్షిక సర్వ సభ్య సమావేశం | 07.06.2025 సా.4.00 గం.కు |

నామినేషన్ పత్రాలు, ఓటర్ల జాబితా ఛాంబర్‌లో లభిస్తాయని గమనించగలరు. మరిన్ని వివరాలకు సంప్రదించండి. ఛాంబర్ మొబైల్: 9640855520.

సం/-కె.దుర్గా ప్రసాద్, ఎన్నికల అధికారి



# రహదారులపై మురుగు నీరు

● **ఇబ్బందులు పడుతున్న జనం**


యాచారంలో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిన హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారి

యాచారం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాలు, పట్టణంలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు మురుగునీటితో నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యాచారంలో హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై చాలా చోట్ల నీరు నిలుస్తోంది. లారీలు, బస్సులు వెళ్తున్న సమయాల్లో మురుగు నీరు చిమ్మి ద్విచక్ర వాహనదారులు, కార్లలో వెళ్లేవారిపై పడుతోంది. ఇక్కడ మురుగు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆర్ అండ్‌బీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. చిన్నతూండ్లలో బీసీ వార్డులో రోడ్డుపై భారీ గుంటలో నీరు చేరుతోంది. సీసీ రోడ్డు పక్కన మట్టికుప్ప పోయడంతో మురుగు నీరు పారడం లేదు. అయ్యవారిగూడలో నజ్దీక్‌సింగారం రోడ్డులో మురుగు నీరు నిలుస్తోంది. నెలల తరబడి ఇదే పరిస్థితి ఉందని, తాము ఇబ్బందుల పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే గ్రామంలో పాఠశాల వద్ద రోడ్డుపై మురుగు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. అయ్యవారిగూడలో రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని పారదోలేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. రెండు చోట్ల సీసీ రోడ్డుపై నీరు నిలుస్తోంది.


అయ్యవారిగూడ పాఠశాల సమీపంలో రోడ్డుపై నిలిచిన మురుగు

**మురుగు నిల్వ ఉండకుండా చూడాలి**



వర్షం కురిస్తే రోజుల తరబడి రోడ్లపై నిలుస్తున్నాయి. వాహనాలు జారి పడుతున్నాయి. పెద్ద వాహనాలు వెళ్తే నీరు మనుషులపై చిమ్ముతోంది. బీటీ రోడ్లపై మురుగు నీరు నిలవకుండా అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. నీరు నిలిచి బురదమయం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- జగన్, అయ్యవారిగూడ

# వరి కోతలకు కూలీలు దూరం!

● హార్వెస్టర్‌కు గంటకు రూ.2,500
● దోపిడీకి గురవుతున్న రైతులు

పరిగి, మే 4(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంట కోతకు వచ్చిన దశలో కూలీల కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం పంట కోతకొచ్చింది. రోజులో వేసవి ఎండలు, ఆ వెంటనే ఈదురు గాలులు, వర్షంతో చేతికొచ్చిన పంట ఎక్కడ నేలపాలవుతుందోనని రైతులు ఆందోళ చెందుతున్నారు. కూలీల కొరతతో అష్ట కష్టాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా వరి పంట ఆశాజనకంగా ఉంది. 18 మండలాల్లో 19,807 మంది రైతులు 95,834 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎక్కడ చూసినా చేతికొచ్చిన పంట కన్పిస్తోంది. ప్రస్తుతం వరి పంట చేతికిరావడంతో రైతులు కోతల్లో బిజీగా ఉన్నారు. కొందరు రైతులు సొంతంగా కోతలు చేయాలనుకుంటున్నా ఎండకు తాళక కూలీలు కోతలకు రావడం లేదు. ఒక్కో కూలికి రూ.400 కూలి, దావత్ ఇస్తామన్నా కూలీలు కోతలకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఒకవైపు కూలీల కొరతతో ఇబ్బందులు పడుతుండగా, మరో వైపు హార్వెస్టర్లు సైతం దొరకక కోత కొచ్చిన వరి చేను పొలంలో ఉంటోంది. కూలీల కొరతతో హార్వెస్టర్ల యజమానులు కూడా రేట్లు పెంచుతున్నారు. మొన్నటి వరకు హార్వెస్టర్‌కు గంటకు రూ.1,800- 2,000 వరకు తీసుకున్నారు. ప్రస్తుతం వరి కోతకు గంటకు రూ.2,100 నుంచి రూ.2,500 తీసుకుంటున్నారు. ఒక పక్క కూలీలు దొరకక, మరోపక్క వర్షాల భయంతో తప్పని పరిస్థితిలో ధర పెంచినప్పటికీ యంత్రాలతో వరి కోతలు కోయించి నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులను పేద రైతుల వ్యవసాయ పనులకు ఉపయోగిస్తే వారికి మేలు జరుగుతుందని చిన్న, సన్నకారు రైతులు కోరుతున్నారు.


బొంపల్లిలో వరి కోస్తున్న హార్వెస్టర్




కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను ఎండబోసిన రైతులు

# ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో?

● కాశీంపూర్ కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

బషీరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా.. వడ్లు మాయిశ్చర్ వచ్చినా మండలంలోని కాశీంపూర్ కేంద్రంలో తూకాలు ఇంకా ప్రారంభం కాలేదు. ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించి వారానికిపైగా అవుతున్నా ధాన్యం సేకరించడంలేదని రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను ఎండబోస్తూ కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నామని రైతులు వాపోతున్నారు. ఉరుములు మెరుగులతో ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటున్నాయని, వర్షమొస్తే వడ్లన్నీ తడిసిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు విశ్వనాథ్‌రెడ్డి, మల్లప్ప, దస్తప్ప తదితరులు మాట్లాడుతూ.. అన్ని కేంద్రాల వద్ద తూకాలు వేస్తున్నారని, ఇక్కడ మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మరి ఈ కేంద్రాన్ని ఎందుకు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రటి ఎండలో వడ్లు ఎండబోస్తున్నామని, పూర్తిగా ఎండి తేమ లేకుండా తూకానికి వచ్చినా కాంట వేయకుంటే ఎలా అని అన్నారు. ఒక వేళ వర్షం వస్తే వడ్ల కుప్పలన్నీ తడుస్తాయని అన్నారు. ఈ విషయమై ఐకేపీ ఏపీఎం పద్మారావు స్పందిస్తూ.. హమాలీల కొరత వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తామని రైతులు ఆందోళన చెందొద్దని హామీ ఇచ్చారు.

## కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ధారూరు, మే4(ఆంధ్రజ్యోతి): గట్టెపల్లి,రాంపూర్, ధారూరు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో హరిదాసుపల్లి ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి సిద్ధమ్మ పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

# టౌన్ ప్లానింగ్ విభాగ అధికారి లేక...

● బల్దియా ఆదాయానికి రూ.లక్షల్లో గండి

తాండూరు, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అతి పెద్ద మున్సిపాలిటీ.. వందల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. నిబంధనల అమలు చేసి బల్దియా ఆదాయాన్ని పెంచేందుకు ఓ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఉండాలి. అయితే మూడు నెలలుగా ఇక్కడ టీపీవో లేరు. దీంతో నిర్మాణ అనుమతుల కోసం మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. తాండూరు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పర్యవేక్షణాధికారి లేదు. ప్రభుత్వం ఇక్కడ టీపీవోను నియమించక టౌన్ ప్లానింగ్ విభాగం గాడి తప్పింది. ప్రధానాధికారి లేక, కింది స్థాయి సిబ్బంది కొత్తవారు కావడంతో శాఖపై పట్టులేక పనులు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగాధికారులు ఎప్పుడొస్తారో? ఎప్పుడు పోతారో.. తెలియని పరిస్థితి ఉంది. వారానికోసారి వచ్చే టీపీఎస్ లాలప్ప ప్రమోషన్‌పై జీహెచ్ఎంసీకి బదిలీ కాగా గత మొన్ననే రిలీవయ్యారు. కొత్తగావచ్చిన ఇద్దరు టీపీబీఓలు, మున్సిపాలిటీలోనే సర్దుబాటు చేసిన ఇద్దరు చైన్‌మెన్ ఉన్నారు. ఉన్నతాధికారులు శ్రద్ధపెట్టక రూ.లక్షల ఆదాయం నష్టపోవాల్సి వస్తోంది. జిల్లాలోనే భారీ ఆదాయం వచ్చే తాండూరు మునిపాలిటీలో ఖాళీలను భర్తీచేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ యాదగిరి

## రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

దుద్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ధాన్యం ఎండబోస్తే చర్యలు తప్పవని దుద్యాల ఎస్ఐ యాదగిరి రైతులకు సూచించారు. పలు గ్రామాల్లో రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసిన రైతులతో మాట్లాడి వెంటనే రోడ్లపై నుంచి ధాన్యాన్ని తొలగించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ధాన్యంపై నల్లని కవర్లను కప్పడంతో కనిపించక ప్రమాదాలు జరిగుతున్నాయని చెప్పారు. నిత్యం ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రైతుల పొలాల పక్కన చదును చేసుకొని ధాన్యాన్ని ఎండబోసుకోవాలన్నారు.



## ప్రభుత్వ బడుల్లోనే బంగారు భవిష్యత్తు

పరిగి, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులని మిట్టకోడూరు పాఠశాల హెచ్ఎం ఉస్మాన్అలీ అన్నారు. శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిట్టకోడూరు పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్న విద్యార్థుల ప్రోగ్రెస్‌ను పరిశీలించారు. పది రోజులుగా విద్యార్థులు నేర్చుకున్న కళలు, ప్రకృతి-పచ్చదనం, చిత్రలేఖనం, మట్టితో వివిధ ఆకృతులను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు అనిత, ఫౌండేషన్ మెంటర్ హన్మంత్, టీచర్ నర్సింహులు, గ్రామస్తుడు వేమన్న పాల్గొన్నారు.



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కె.మహేశ్‌రెడ్డి

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి

పరిగి, మే 4 (ఆంధ్రజ్యోతి): పరిగిలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొడంగల్ చౌరస్తాలో భగీరథ మహర్షి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. భగీరథ మహర్షి సమాజోద్ధరణ పనులు అందరికీ ఆదర్శం అన్నారు. నేటి సమాజం ఆయన పట్టుదలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు సురేందర్, ఆర్.ఆంజనేయులు, బి.ప్రవీణ్‌రెడ్డి, రవి సగర, పి.మాణిక్యం పాల్గొన్నారు.




జాన్‌వెస్లీకి వినతిపత్రం ఇస్తున్న సదానందంగౌడ్

## గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఆమనగల్లు, మే 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్య బలోపేతానికి అతిథి అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆయిల్ సదానందంగౌడ్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 536 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న 1,654 మంది గెస్ట్ లెక్చరర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఆదివారం సంఘం నాయకులతో కలిసి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి వినతిపత్రం ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటర్ బోర్డు కమిషనర్‌తో మాట్లాడి తగిన న్యాయం జరిగేలా చూస్తానని జాన్‌వెస్లీ హామీ ఇచ్చారని సదానందంగౌడ్ తెలిపారు.

# లైట్లు ఆర్పరా?

- పగటిపూటా ఆన్‌లోనే ఉంటున్న వీధి దీపాలు
- పట్టించుకోని అధికారులు



కర్ణంగూడ-పోచారం రోడ్డులో పగటి పూట వెలుగుతున్న స్ట్రీట్ లైట్

ఆదిభట్ల, మే 4(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం, కర్ణంగూడ, ఎలిమినేడు, తుర్కగూడ గ్రామాల్లో వీధిలైట్లు రాత్రీ పగలు తేడా లేకుండా కరెంటు ఉన్నంతసేపూ వెలుగుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యమో లేక పంచాయితీ సిబ్బంది నిర్వహణ లోపామో కానీ ఈ గ్రామాల్లో వీధి లైట్లు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామా పంచాయితీలకు విద్యుత్ బిల్లు భారం ఎక్కువవుతుంది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు రోజు ఉదయం, సాయంత్రం లైట్లను ఆన్‌ఆఫ్ చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించిన నిర్వహణ మాత్రం సరిగా లేదు. విద్యుత్ లైట్లను ఆన్ ఆఫ్ చేయకపోవడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతోందని స్థానిక ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. గ్రామాల్లో కొన్ని చోట్ల ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసిన పూర్తి స్థాయిలో స్విచ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ లైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. విద్యుత్‌ను ఆదాచేయాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్తంభాలకు వేసిన విద్యుత్ లైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి ఆన్‌ఆఫ్ స్విచ్‌లను బిగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఎలిమినేడులో పగటిపూట వెలుగుతున్న వీధి లైట్



# యాసంగి జోరు!

(ఐదో పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లాలో 1,38,659 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 1,34,542 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 16,391 ఎకరాలు సాగు చేశారు. ఈ ఏడాది ఇంకా సమయం ఉన్నప్పటికీ వీటిని మించి పంటలు వేశారు. ఇంకా వరి నాట్లు కొనసాగుతుండడంతో పంటల సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం వరి సన్నాలకు ప్రోత్సాహకం ఇవ్వడంతో యాసంగిలో వరి సాగు భారీగా పెరిగింది. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 156 శాతం వరి పంటను రైతులు సాగు చేశారు. అలాగే వికారాబాద్‌లో వరి సాగు 148 శాతంగా నమోదైంది. వరి తరువాత ఎక్కువగా వేసే మొక్కజొన్న పంట సాగు కూడా గణనీయంగా పెరిగింది. రంగారెడ్డిజిల్లాలో మొక్కజొన్న పంట రికార్డు స్థాయిలో వేశారు. సాధారణంగా యాసంగి సీజన్‌లో 7,774 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేయాల్సి ఉండగా... దీనికి దాదాపు రెండింతలు అంటే 22,606 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట వేశారు. అలాగే వికారాబాద్ జిల్లాలో సాధారణంతో పోలిస్తే 190శాతం అధికంగా మొక్కజొన్న సాగు చేశారు. యాసంగి ఆరంభంలో వర్షాలు కురిసి ఉంటే దాదాపు రెట్టింపు స్థాయిలో పంటలు సాగు జరిగేది.

### రెండు నెలల్లో వర్షాలు

గత వానాకాలం సీజన్‌లో మూడు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. అయితే యాసంగి ఆరంభంలో కనీస స్థాయిలో కూడా వానలు లేకపోవడంతో పంటల సాగు 60శాతం కూడా దాటుతుందా? అనే సందేహం కలిగింది. అయితే మార్చి, ఏప్రిల్ నెలలో మోస్తరుగా కురిసిన వర్షాలు రబీకి ఊపిరిపోశాయి. మూడు జిల్లాల్లో సగటు ఈ రెండు నెలల్లో 30 మి. మీ పైగా వర్షపాతం నమోదైంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ స్థాయిలో వర్షాలు పడడం చాలా అరుదు. యాసంగి సాగుకు వాతావరణం అనుకూలించడంతో అనూహ్యంగా పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. మొత్తం మీద వానాకాలం, యాసంగి సీజన్‌లలో సగటు కంటే అధిక వర్షాలు కురిశాయి. రంగారెడ్డి జిల్లాలో 20 శాతం, వికారాబాద్ జిల్లాలో 34 శాతం, మేడ్చల్‌లో 12 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వర్షాల వల్ల పలుచోట్ల భూగర్భ జలాలు కొంత మెరుగుపడ్డాయి.

# ఇబ్రహీంపట్నం-ఆక్టోపస్ రోడ్డుకు మోక్షం!

**4.5 కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారి ● రూ.35కోట్ల హెచ్ఆర్‌డీసీఎల్ నిధులతో పనులు**

ఇబ్రహీంపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నుంచి నాగన్‌పల్లి వెళ్లే రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్‌లకు వెళ్లే ప్రధాన దారి ఇదే. కీలకమైన ఈ రోడ్డు విస్తరణకు నోచుకోవడం లేదు. చివరకు హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్ఆర్‌డీసీఎల్) నిధులు రూ35 కోట్లు మంజూరు కాగా టెండర్ ప్రక్రియ పూర్తయి సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి సీహెచ్‌సీ ముందు నుంచి ఆక్టోపస్ వరకు 24.4మీటర్ల వెడల్పుతో 4.5కిలోమీటర్లు నాలుగు లేన్ల రహదారిని విస్తరించనున్నారు. రోడ్డు డివైడర్ ఏర్పాటు చేస్తారు. చౌరస్తా నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణకు ఎలాంటి ఇబ్బందుల్లేవు. అక్కడి నుంచి కుమ్మరి బస్తీ, కల్లు కాంపౌండ్ నుంచి టౌన్ చివరి వరకు రోడ్డుకు రెండు వైపులా ఇళ్లను కొంత మేర తొలించేందుకు మార్కింగ్ చేశారు. ఇళ్లు తొలగించే క్రమంలో నాలుగేళ్ల క్రితం బస్తీ వాసులు కొందరు అడ్డుపడి కోర్టు స్టే తేవడం, కొందరి రాజకీయ జోక్యంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ఇక్కడ మార్కింగ్ ఇచ్చిన మేరకు ఇరువైపులా ఇళ్లను తొలగిస్తారా? లేక టౌన్ చివరి వరకు రోడ్డు నిడివి తగ్గిస్తారా? అనేది తేలాల్సి ఉంది. కంకర, మట్టి రోడ్డుతో నిత్యం దుమ్ము ధూళి లేచి బస్తీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సింగిల్ రోడ్డు గుంతలుపడి వాహనాలు వెళ్లేందుకు కష్టంగా ఉంది. ఎదురుగా వాహనమొస్తే క్రాస్ చేయడం కూడా ఇబ్బందిగా ఉంది. ట్రాఫిక్ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. చౌరస్తా నుంచి సీహెచ్‌సీ వరకు దుకాణ సముదాయాలున్నాయి. ప్రతీ బుధవారం సంతకు వేలాది మంది వస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ రహదారి పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరుతుంది.



ఇబ్రహీంపట్నం టౌన్‌లో విస్తరించాల్సిన రోడ్డు ఇదే..

### బస్తీ వాసులను ఒప్పించాలి



ప్రాధాన్యం కలిగి పట్టణ చౌరస్తా గుండా వెళ్తున్న ఈ రోడ్డును త్వరితగతిన విస్తరించాలి. రోడ్డు పూర్తిగా పాడైంది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేకుండా మారింది. ఇంత కాలానికి ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. రోడ్డు విస్తరణకు అడ్డుపడుతున్న బస్తీ వాసులను అధికారులు ఒప్పించి పనులు చేపట్టాలి.

- చంద కరుణాకర్, ఇబ్రహీంపట్నం

### ఎమ్మెల్యే చొరవ చూపాలి



ఇబ్రహీంపట్నం గుండా వెళ్తున్న ప్రధాన రోడ్డు కావడంతో ఈ రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ చూపి బస్తీవాసులతో మాట్లాడాలి. రోడ్డు బాగలేక నాగన్‌పల్లి, పోల్కంపల్లి వెళ్లేవాళ్లు చుట్టూ తిరిగి రాయపోల్ రోడ్డు గుండా వెళ్తున్నారు.

- సీహెచ్.బుచ్చిరెడ్డి, ఎన్గల్‌గూడ

### త్వరితగతిన రోడ్డు పనులు చేపడతాం

ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి టౌన్ చివరి వరకు ఇప్పుడు బీటీ ఉన్నందున తిరిగి బీటీ వేయాలా? లేదా సీసీ రోడ్డు అనేది నేల తీరును బట్టి నిర్ణయం తీసుకుంటాం. రహదారి విస్తరణకు మార్కింగ్ వరకు ఇళ్లు తొలగించే విషయంలో మున్సిపల్ అధికారులే చొరవ తీసకోవాలి. ప్రసుత్తం సర్వే పనులు చేస్తున్నాం. రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ లైన్లు ఉన్నందున వీటిని మార్చాల్సి ఉంది. విద్యుత్ శాఖ అధికారులు ఎస్టిమేట్ చేస్తున్నారు. కృష్ణా నీటి సరఫరా పైపులైన్ల ఎయిర్ వాల్వ్‌ల చాంబర్లను కూడా మార్చాల్సి ఉంది. ఇప్పటికే రోడ్డు పనుల మిషనరీ వచ్చింది. త్వరలోనే పనులు చేపడతాం.

- కిషోర్‌బాబు, డీఈ, హెచ్ఆర్‌డీసీఎల్



కొనసాగుతున్న సర్వే పనులు

### అన్నింటికీ ఇదే ప్రధాన రోడ్డు ...

ఇబ్రహీంపట్నం చెరువుకట్ట నుంచి ఉత్తరం వైపున టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు వరకు టీజీఐఐసీ క్రొగా రోడ్డేసింది. ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్‌కు వెళ్లే వాహనాలు పట్టణం నుంచి కాకుండా ఈ రోడ్డు గుండా కృష్ణా పైప్‌లైన్ బైపాస్ గుండా నాగన్‌పల్లి రోడ్డు వరకు వెళ్తున్నాయి. అక్కడి నుంచి గుంతలమయంగా ఉన్న సింగిల్ రోడ్డుపై రెండు కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. అత్యవసర సమయాల్లో ఎన్ఎస్‌జీ కమెండోలు, ఆక్టోపస్ జవాన్ల వాహనాలు వేగంతో వెళ్లాలంటే ఈ రోడ్డు బాగలేదు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లాలన్నా ఇదే రోడ్డు. అలాగే నాగన్‌పల్లి, పోల్కంపల్లి, నెర్రెపల్లి గుండా విజయవాడ జాతీయ రహదారికి ఇది లింకు రోడ్డు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ రోడ్డు అభివృద్ధి జరుగనుంది.

### నిర్వాసితులకు స్థలాలు కేటాయిస్తామన్నా..

రోడ్డు విస్తరణలో ఇబ్రహీంపట్నంలో ఇళ్లు కోల్పోయిన వారికి వినోబానగర్‌లోని భూదాన్ భూముల్లో స్థలాలు చూపుతామని అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. దీంతో కొందరు ఒప్పుకోగా మరికొందరు అడ్డుకోవడంతో పనులు చేయలేదు. మున్సిపాలిటీలో రోడ్డులేక ఈ బస్తీలు కళ తప్పాయి. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉంది. ఇప్పుడు రహదారి విస్తరణకు బస్తీ వాసులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ అధికారులు మరోమారు చర్చలు జరిపి వీరిని ఒప్పించాల్సి ఉంది. లేదంటే టౌన్‌లో రోడ్డు వెడల్పు తగ్గించి పనులు చేపట్టాల్సి ఉంటుంది.

# రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

కడ్తాల్, మే 4(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని, స్థానికులు పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మత రాజకీయాలతో దేశ ఐక్యతను దెబ్బతీస్తున్న బీజేపీ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని చెప్పారు. చల్లంపల్లిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల అధ్యక్షుడు బిచ్యానాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌ల విగ్రహాలకు పూలమాలలు వేశారు. రాజ్యాంగ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను జాగృతం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగ విలువలను కాలరాస్తోందన్నారు. రాజ్యాంగ కర్త అంబేడ్కర్‌నే అవమానించిన చరిత్ర బీజేపీదన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఏడాదిన్నరలో 450 ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటుతో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించామన్నారు. రూ.500కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమాన్‌నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్, నాయకులు నరేందర్, కృష్ణయ్య, సురేందర్‌రెడ్డి, అశోక్, బాల్‌రాజ్, చేగురి వెంకటేశ్, రవి, రాజేశ్, రాజేందర్, షాబుద్దీన్, ఇమ్రాన్‌బాబ, శంకర్, నరేశ్, శంకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



జంగారెడ్డిపల్లిలో రోడ్డుపై పారబోసిన చెత్త

## రహదారి పక్కనే చెత్త డంప్

ఆమనగల్లు, మే 4(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డి పల్లి వద్ద రోడ్డుపై చెత్తడంప్‌తో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును అనుసరించి నిత్యం చెత్త ,వ్యర్థ పదార్థాలు డంప్ చేస్తుండడంతో దుర్వాసన వస్తోంది. మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది స్థానికంగా సేకరించిన చెత్తను ఆమనగల్లు-మాడ్గుల రోడ్డు పక్కన డంప్ చేస్తున్నారు. రోడ్డు పక్కన డంప్ రోజురోజుకు పేరుకుపోతోంది. చెత్తడంప్‌తో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. డంప్ చేసిన చెత్త వద్దకు కుక్కలు చేరడంతో ద్విచక్ర వాహనదారులు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి దూరంగా చెత్త డంప్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. చెత్త డంప్ యార్డ్‌లు నిర్మించినా రోడ్ల పక్కన చెత్త వేయడంపై ప్రజలకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపక్కన చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

## విపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ఆమనగల్లు, మే4(ఆంధ్రజ్యోతి): విపక్షాల విషప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు ఎండగడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని సీడబ్లూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పాలనసాగిస్తోందన్నారు. కడ్తాల, ఆమనగల్లు మండలాల్లో ఆదివారం వంశీచంద్ పర్యటించి పలు కార్యక్రమాల్లో, వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ఇందుకు గతంలో చేపట్టిన కులగణనే నిదర్శనం అన్నారు. విపక్షాలు ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా మారాయిని మండిపడ్డారు. పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోకపోతే దేశానికే ప్రమాదం అన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతానర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు నరసింహ, అజీమ్, చేగురి వెంకటేశ్, నరేందర్, చెన్నకేశవులు, ఆరిఫ్, మల్లేశ్, సత్యం, శేఖర్‌గౌడ్, లక్ష్మయ్య, గణేశ్ పాల్గొన్నారు.



బీటీ రోడ్డు వేసేందుకు ఫార్మేషన్ రోడ్డును చదును చేస్తున్నారిలా...

## ముమ్మరంగా అల్లాపూర్-సిరిగిరిపేట్ బీటీ పనులు


- రూ.2.15కోట్ల సీఆర్ఆర్ గ్రాంట్ నిధులు
- 2.4కిలో మీటర్ల నూతన రహదారి

తాండూరురూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం సిరిగిరిపేట్ నుంచి అల్లాపూర్ వరకు ప్రస్తుతం ఉన్న ఫార్మేషన్ రోడ్డుపై 2.4కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇందుకోసం సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.2కోట్ల 15లక్షలను మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పనులను వేగంగా చేపడుతున్నారు. తాండూరు పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు రోడ్డు పనులను నాణ్యతగా చేసేలా పర్యవేక్షిస్తున్నారు. 2.4కిలో మీటర్లు ఉన్న ఫార్మేషన్ రోడ్డుపై 40ఎంఎం కంకర వేసి రోలర్‌తో చదను చేస్తున్నారు. తర్వాత మెటవిక్స్ నిర్వహించి రోడ్డుపై 8 ఇంచల మందంతో గ్రావెల్ వేస్తారు. గ్రావెల్ పనులు కాగానే దానిపై బీటీ వేస్తామని పంచాయతీరాజ్ ఏఈ నందిని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే సిరిగిరిపేట్ నుంచి అల్లాపూర్ మీదుగా ప్రయాణికులు తాండూరు వచ్చేందుకు దూరం తగ్గుందని పేర్కొన్నారు. ఈ లింకు రోడ్డుతో ప్రయాణికుల, వాహనదారుల దూరాభారం తగ్గనుంది. పనులను తాండూరు పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ డీఈ కృష్ణజోషి పనులను పర్యవేక్షిస్తున్నారు.



రోడ్డును చదును చేస్తున్న రోలర్

### రూ.54కోట్ల సీఆర్ఆర్ నిధులతో రోడ్డు పనులు



తాండూరు నియోజకవర్గ గ్రామాల్లో రూ.54కోట్ల సీఆర్ఆర్ నిధులతో అన్ని లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తున్నాం. బీటీ రోడ్డు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. లింక్ రోడ్లతో గ్రామాలకు దూరభారం తగ్గుతుంది. నాణ్యతతో పనులు చేయిస్తున్నాం. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద తాండూరు డివిజన్‌లో 53పనులకు రూ.10.24కోట్లు మంజూరయ్యాయి. మంజూరైన అన్ని పనులు త్వరలోనే పూర్తి చేస్తాం.

- సత్యనారాయణరెడ్డి, ఈఈ, పీఆర్, తాండూరు డివిజన్

## మరమ్మతుకు నోచని నిఘా నేత్రాలు


చౌడాపూర్ ప్రధాన కూడలిలో పని చేయని సీసీ కెమెరాలు

చౌడాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పనిచేయకోవడంతో తరచూ చోరీలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో సీసీకెమెరాలు మరమ్మతుకు నోచుకోవడంలేదని ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రధాన మార్గం మీదుగా కులకచర్ల, జాకారం, మందిపాల్ గ్రామాలకు వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. దాదాపు 3 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన సీసీకెమెరాలను పర్యవేక్షించే వారు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇటీవలే చౌడాపూర్ నుంచి కొత్తపల్లి గ్రామానికి వెళ్తుండగా ఓ వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా సీసీకెమెరాల మరమ్మతుతో వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# కంకర వేశారు.. బీటీ మరిచారు

- గుంతలమయమైన రుద్రారం-తాండూర్ రోడ్డు
- ఏడాది కిందటే నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం
- వాహనదారులకు ఇబ్బందులు


నాగారం నుంచి జుంటుపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి

కొడంగల్, మే 4 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైన కొడంగల్ ప్రాంతం సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ముందుకెళ్తోంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఇందుకు కొడంగల్ మండలంలోని రుద్రారం నుంచి నాగారం మీదుగా పగిడిపల్లి, జుంటుపల్లి, అక్కంపల్లి రోడ్ల దుస్థితే నిదర్శనం.రోడ్డు అభివృద్ధి కోసం ఏడాది క్రితం నిధులు మంజూరైనా కంకరవేసి బీటీ వేయడం మరిచారు. అసలే అటవీ ప్రాంతంలోని రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు రాత్రి వేళల్లో భయాందోళనకు గురవుతున్నారు. నాగారం నుంచి పగిడిపల్లి, అక్కంపల్లి, చెన్నారం గేటు వరకు దాదాపు 20కిలో మీటర్ల మేర వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

### గ్రామాలకు 20కి.మీ దూరభారం తగ్గింపు

మండలంలోని రుద్రారం, నాగారం, పాటిమీదిపల్లి, అన్నారం, టేకుల్‌కోడ్, అంగడిరైచూర్‌తోపాటు గిరిజనతండాల ప్రజలు తాండూరుకు వెళ్లాలంటే కొడంగల్ మీదుగా 40కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి ఉంటుంది. రోడ్డు గుంతలమయంగా అధ్వానంగా మారడంతో తాండూరు ఆర్టీసీ బస్సు ఉదయం, సాయంత్రం వేళలో రాకపోకలు కొనసాగిస్తుంది. మిగతా సమయాల్లో తాండూర్‌కు వెళ్లాలంటే ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. నాగారం మీదుగా జుంటుపల్లి, పగిడిపల్లి, అక్కంపల్లి, చెన్నారం వరకు రోడ్డు అభివృద్ధి జరిగితే పది గ్రామాల ప్రజలకు 20కిలో మీటర్ల మేర దూర భారం తగ్గుతుంది.

### తరచూ ప్రమాదాలు

మండలంలోని నాగారం శివారు కొద్ది దూరంలో తాండూర్ నియోజకవర్గం, యాలాల్ మండల శివారులోని జుంటుపల్లి, పగిడి పల్లి, అక్కంపల్లి, చెన్నారం మీదుగా రోడ్డు అధ్వానంగా ఉంది. ఏడాది కిందట నిధులు మంజూరైనా ఇప్పటి వరకు కంకర మాత్రమే వేసి వదిలిపెట్టడంతో వాహనదారులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి కొడంగల్ ప్రాంత ప్రజాప్రతినిధులు, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టి సారించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

**రోడ్డు పనులను పూర్తి చేయాలి**

తాండూర్‌కు వెళ్లేందుకు నాగారం నుంచి సమీపంలోని రోడ్డు మార్గం గుంతలమయంగా మారడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏడాది కిందటే నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం కారణంగా ఇబ్బందులు తప్పడంలేదు. పనులను వేగవంతం చేసి వాహనదారులు, ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

**- అంజిల్‌రెడ్డి, నాగారం**

## నేడు ధారూరుకు స్పీకర్, మంత్రి రాక

ధారూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ధారూరులోని రైతు వేదికలో నేడు(సోమవారం) నిర్వహించనున్న రైతుల ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిలు విచ్చేస్తున్నారని ఏవో సూర్యప్రకాష్ తెలిపారు. ఈకార్యక్రమానికి మండలంలోని రైతులు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు.

## ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో నర్సింహారెడ్డి కుటుంబసభ్యులు

దుద్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్‌లో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం ఆలయ నిర్మాణ దాత గజ్జల నర్సింహారెడ్డి కుటుంబసభ్యులు భూమిపూజ చేశారు. కోటి రూపాయలతో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణాన్ని సంవత్సరంలోపు నిర్మాణ పనులను పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. స్వామి ఆశీస్సులతో గ్రామప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, నరేందర్‌రెడ్డి, ఆనందయ్య, వెంకటయ్య యాదవ్, సి.శ్రీనివాస్, రాములు యాదవ్, రవీందర్ పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎం సహాయనిధి


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దోమ, మే 4 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లికి చెందిన చీమే సత్యమ్మకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.28వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం అందజేశారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు ప్రభుత్వం సీఎం సహాయనిధితో ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబర్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి


మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పరిగి, మే 4 (ఆంధ్ర జ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయిసేవాసమితి అధ్యక్షుడు వెంకట్ రెడ్డి అన్నారు. సత్యసాయి సేవాసమితి రంగాపూర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 101మంది వైద్యపరీక్షలు నిర్వహించి, వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ బృందం బస్వరాజు, ప్రభాకర్, నాగరాజు, మహేందర్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ మండల అధ్యక్షుడు బిల్లపాటి రాజశేఖర్‌రెడ్డి, ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ అన్నారు. మండల పరిధిలోని జైదుపల్లి, సర్పన్‌పల్లి గ్రామంలోఆదివారం జై బాపు జై బీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మల్లేశం, తుకారం, ప్రభాకర్ రెడ్డి, రవీందర్, పాండు, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గోపాల్

వికారాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓం శాంతి భవనంలో ఆదివారం విశ్వవిద్యాలయ సహకారంతో ఆక్యుప్రెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్ థెరపీ, సుజోక్ థెరపీపై ప్రత్యేక ఆరోగ్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ శిబిరం మే 4 నుంచి 8 వరకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓం శాంతి బ్రహ్మకుమారి, డాక్టర్ వైష్ణవ్, పంతులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'జై సంవిధాన్'ను విజయవంతం చేయాలి

శామీర్‌పేట, మే 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో తలపెట్టిన సంవిదాన్ పాదయాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఆర్టీఏ సభ్యుడు, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆదివారం పిలుపు నిచ్చారు. సోమవారం(నేడు) ఉదయం 10.30 గంటలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీఎత్తున సంవిదాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని అల్వాల్ సర్కిల్ ఈ సేవా కేంద్రం వద్ద గల రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి ఓల్డ్ అల్వాల్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు పార్టీ ఆధ్వర్యంలో భారీఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అధ్యక్షతన, మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ పట్నం సునీతమహేందర్‌రెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, దుర్గం భాస్కర్, బండారు శోభారాణి విచ్చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## నేడు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

తాండూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి):తాండూరు మండలం, పట్టణ పరిధిలోని నేడు(సోమవారం) షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

# రైల్వేగేటు కష్టాలు తీరేదెన్నడో?


బషీరాబాద్ రైల్వేగేటు వద్ద ఇరువైపులా నిలిచిన వాహనాలు (ఫైల్)

బషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్(నవాంద్గి) రైల్వేస్టేషన్ సమీపంలో రెండు ట్రాకుల మీదుగా ఏర్పాటు చేసిన రైల్వేగేటుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైళ్లు వెళ్తున్నప్పుడు గేటు వేస్తుండటంతో వాహనదారులు ఒక్కోసారి అరగంట వరకు నిరీక్షించాల్సి వస్తోంది. ఈ రైల్వేస్టేషన్ గేటుకు ఒక వైపు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, మరోవైపు బ్యాంకులు, పాఠశాలలు ఉన్నాయి. ఈ గేటు మీదుగా నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు వందలాదిగా రాకపోకలు సాగిస్తుండటంతో అడ్డంకిగా మారింది. దశాబ్దాల కాలంగా ఈ గేటుకు ఆర్‌యూబీ(రైల్వే అండర్ బ్రిడ్జి)నిర్మించాలని కోరుతున్నా రైల్వే అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆరేళ్ల కిందట ఇక్కడ ఆర్‌యూబీ నిర్మాణం కోసం రైల్వే ఇంజనీరింగ్ అధికారులు గేటుకు ఇరువైపులా సర్వేలు, నిర్మాణ ప్రాంతంలో మట్టి నమూనాలు సేకరించారు. నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు అప్పట్లో రైల్వేఅధికారులు తెలిపారు. తర్వాత ఏమైందో కానీ ఆర్‌యూబీ నిర్మాణం ఊసే లేకుండాపోయింది. ఈప్రాంతంలో ఇళ్లు ఉండటంతో బ్రిడ్జి నిర్మాణం సాధ్యం కాదని, వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ విషయమై బషీరాబాద్ మాజీ జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి నాలుగేళ్ల కిందట ఢిల్లీలోని రైల్వేశాఖ ఉన్నతాధికారులను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అప్పట్లో ఆర్‌యూబీ నిర్మాణానికి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు అప్పట్లో వెల్లడించారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుని గేటు ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ధాన్యానికి తూకమెప్పుడు?

(ఐదో పేజీ తరువాయి)

పండించిన వరి ధాన్యాన్ని మాధారం కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్నారు. రైతులు వరికోతలు చేపట్టి దాదాపు 20 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు మాత్రం చేయడం లేదు. హమాలీలు ఉంటే కేంద్రంలోని సగం ధాన్యం ఖాళీ అయ్యేదని రైతులు వాపోతున్నారు. కాని ఇప్పటివరకు గింజధాన్యం సైతం తూకం వేయలేదని ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. రోజు కురుస్తున్న వర్షాలకు రైతులు సాయంత్రం ధాన్యంపై కవర్లు కప్పి మరుసటి రోజు ఉదయం ఆరబెట్టడం పనిగా పెట్టుకున్నారు. అదే తూకాలు, హమాలీలు ఉంటే తమ ధాన్యం ఎప్పుడో తరలించేవాళ్లమని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తూకాలు, హమాలీలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**రెండు రోజుల్లో ధాన్యం సేకరిస్తాం**

హమాలీల కొరత ఉన్నమాట వాస్తవం. ఏటా హమాలీలు బీహార్ నుంచి వస్తారు. కాని, ఈ ఏడాది రాలేదు. రెండు రోజుల్లో హమాలీలను తీసుకొచ్చి ధాన్యం కొనుగోళ్లు చేపడుతాం. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

**- బోజన్నగారి వెంకటరమణారెడ్డి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్**

# లోపమెక్కడ?

- జిన్‌గుర్తి, మల్కాపూర్‌లో తగ్గిన 'పది' ఉత్తీర్ణత శాతం
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమా!




తాండూరు రూరల్ , మే 4 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో ఈ ఏడాది తాండూరు మండలం జిన్‌గుర్తి, మల్కాపూర్ పాఠశాలలో ఉత్తీర్ణతశాతం పడిపోయింది. పూర్తిస్థాయి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ఫలితాలు పడిపోవడంతో ఇంతకు లోపమెక్కడున్నదనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిన్‌గుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మృతంజయ స్వామితో పాటు 12మంది ఉపాధ్యాయులు మల్కాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వైద్యనాథ్‌తో సహా 16మంది ఉపాధ్యాయులు, కరన్‌కోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సహా 17 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఒక్కొక్కరు ఉపాధ్యాయులు ఉండగా తెలుగు, ఇంగ్లీష్ మీడియానికి ఇద్దరిద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. జిన్‌గుర్తి పాఠశాలలో 31మంది విద్యార్థులకు గానూ 8మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మల్కాపూర్‌లో 55మందికి గానూ 33మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కరన్‌కోట్‌లో 71మందికి గానూ 48మంది మాత్రమే పాసయ్యారు. మండలంలో ఈ ఏడాది ఈ మూడు పాఠశాలలో రిజల్ట్ బాగా తగ్గింది. జిన్‌గుర్తి పాఠశాలలో పూర్తిగా 26శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మిగతా పాఠశాలలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ప్రధానంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడం నెలనెలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పనితీరును పరిశీలించకపోవడం, మండలస్థాయిలో ఉన్నతాధికారులు సక్రమంగా పాఠశాలలను తనిఖీ చేయకపోవడం, తనిఖీ చేసినా నామమాత్రం నివేదికలను ఉన్నతాధికారులకు పంపడం, విద్యార్థులకు బోధించే అంశాలపైన ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించకపోవడం వంటి కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. పిల్లల పురోగతి రిపోర్టులను ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండులకు తెలియజేయకపోవడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

# నీట్ ప్రశాంతం

(ఐదో పేజీ తరువాయి)


వికారాబాద్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

గైర్హాజరయ్యారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఏర్పాట్లపై కేంద్రాల నిర్వాహకులతో ఆరా తీశారు. జిల్లా కేంద్రంలో ఐదు కేంద్రాల్లో నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ సాయిలత, డిప్యూటీ కోఆర్డినేటర్ కుమారస్వామి తెలిపారు.

### మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్ ప్రతినిధి: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4,336 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కలెక్టర్ గౌతమ్ జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

బొంరాస్‌పేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం బొంరాస్‌పేట్ మండలంలోని దుప్‌చర్ల వాగులో నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టీఎస్ 34 జీ 5210 నెంబరు గల ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

## ఏఎంసీ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే పరామర్శ


దామర్‌చెడ్‌లో ఏఎంసీ డైరెక్టర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, మే4 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఏఎంసీ డైరెక్టర్ కొవ్వూరు నరేష్ తండ్రి ఎల్లప్ప(78) ఈనెల 1వ తేదీన అనారోగ్యంతో మృతిచెందారు. ఈక్రమంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదివారం దామర్‌చెడ్ గ్రామంలోని ఇంటికి చేరుకుని ఏఎంసీ డైరెక్టర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎ.రాకేష్, వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్, పి.శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి న్నారు.


## గ్రామాల్లో అప్రకటిత కరెంటు కోతలు


సోమన్‌గుర్తిలో రాత్రి 8గంటలకు వెలగని స్ట్రీట్‌లైట్

పూడూరు మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో కరెంటు కోతలతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అప్రకటితంగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ఉక్కపోత, దోమల బెడదతో తీవ్రంగా అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు విధించడంతో అటు రోడ్లు అంధకారంగా మారుతున్నాయి. దీంతో విష సర్పాలు సంచరిస్తున్నాయని, చీకట్లో బయటికి రావాలంటే భయంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**- పూడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి)**

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చౌడాపూర్: సమ్మేళనంతో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చౌడాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005లో చదివిని పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్దులను నేర్పించిన ఉపాధ్యాయులు అంజయ్య, రమేశ్, వెంకట్‌రెడ్డి, సంగీత, వీరేశం, కృష్ణయ్య, సందీప్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, శశిధర్‌ను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించారు.


ఉప్పరిపల్లిలో కలిసిన పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

శామీర్‌పేట: మండలంలోని ఉప్పర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల్లో 1988-1999 సంవత్సరంలో 7వ తరగతి కలిసి చదువుకున్న అప్పటి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అదే గ్రామంలో ఆదివారం కలిసి ఎంతో సంతోషంగా ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. వారికి విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు సన్మానించారు.

## కేంద్ర సహకారంతో గ్రామాల అభివృద్ధి


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్లనందు అన్నారు. గొట్టిముక్కలో రూ.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను స్థానిక బూత్ కమిటీ అధ్యక్షుడు లింగమయ్య, నరేష్‌లతో కలిసి బీజేపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యుడు, బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్లనందు, రాష్ట్ర దళిత మోర్చా కార్యదర్శి నవీన్ కుమార్, శివరాజ్ గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

# వధూవరులకు ఆశీర్వాదం


తాండూరు రూరల్: వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, తదితరులు

తాండూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన లలితమ్మ, మాల రాజప్పల కూతురు వివాహం ఆదివారం తాండూరు-హైదారాబాద్ రోడ్డు మార్గంలోని జీపీఆర్ గార్డెన్‌లో జరిగింది. ఈ వివాహానికి తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మహేందర్‌రెడ్డితోపాటు సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసాచారి, పెద్దేముల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ మధులత, నాయకులు గడ్డలి రవీందర్, రఘు, భగవాన్, లేబర్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పునీత్, అయ్యూబ్, సంకేత్ పాల్గొన్నారు.

చౌడాపూర్: మందిపాల్‌లో ఆదివారం జరిగిన వివాహాది కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్ రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట రాందాస్, వెంకట్, పరిగి అశోక్ ఉన్నారు.


వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి